పని ఆయనే పూర్తి చేస్తాడు, నిన్ను హృదయగుహలోనికి గెంటుకొనిపోయి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. అప్పుడు ఉత్తమసుఖాన్ని పొందుతావు, అదే కడసారిజన్మ.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-02-2010, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శివరాత్రి. అంటే శివుడు లింగరూపం ధరించినరోజు. శివుడు అంటే మంగళకరుడు. అంటే క్షేమాన్ని ప్రసాదిస్తాడు. మొదటిలింగం అరుణాచలం అని చెపుతారు. సమాజం అంటే జనసమూహము. వ్యక్తి బాగుపడకుండా సమాజం బాగుపడదు. మనం బాగుపడకుండా సమాజం బాగుపడాలి అంటే దానికి అర్థం లేదు. శివరాత్రి రోజున చాలామంది భోజనం చెయ్యరు కాని మనం భోజనాలు చేసి ఇక్కడ కూర్చొన్నాము. శివరాత్రి రోజన బోయవాడి కథ ఎక్కువగా చెపుతారు. కొంతమందికి ఏ రోజున పనికి వెళ్ళకపోతే ఆరోజున అన్నం ఉండదు. శివరాత్రి రోజున ఆ బోయవాడికి పని దొరకలేదు అందుచేత ఆ రోజన అన్నం లేదు. అంటే పగలు భోజనం లేదు రాత్రి నడుము వాల్చుకోవటానికి ఒక చెట్టు మీద కూర్చుని కాలక్షేపానికి ఆ పత్రిని గిల్లి కింద వేస్తున్నాడు. ఆ చెట్టుకింద శివలింగం ఉంది, అది వాడికి తెలియదు. ఆ పత్రి అంతా శివలింగం మీద పడుతోంది. ఆ పత్రికి బాగా మంచు పట్టింది, అది కూడా శివలింగం మీద పడుతోంది. అంటే వాడికి తెలియకుండా పత్రితోటి పూజ చేస్తున్నాడు, పత్రిమీద ఉన్న నీరు శివుడికి అభిషేకం చేస్తున్నాయి. అంటే వాడికి పగలు ఉపవాసం, రాత్రి జాగరణ శివపూజ అయిపోయింది, వాడికి మోక్షం వచ్చేసింది. అంటే వాడు తెలియక చేసాడు. తెలియక చేస్తేనే అంత ఫలితం వచ్చింది ఇంక తెలుసుండి చేస్తే ఇంకెంత ఫలితం వస్తుంది అని ఈ బోయవాడి కథ చెపుతారు.

మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. రూపాన్నిబట్టి శక్తి ఉండదు. మనం భగవంతుడిని అనేక రూపాలతో, నామాలతో పూజిస్తూ ఉంటాము కాని ఉన్నది ఒక్కడే. కొంతమంది కృష్ణుడిని, కొంతమంది శివుడిని, కొంతమంది రాముడిని, కొంతమంది గురువును పూజిస్తారు. మన ప్రయత్నం లేకుండా మన మనస్సు ఎక్కడ నిలబడుతోందో అక్కడే మనం ఉపాసన చెయ్యాలి. చాలామంది వికారం మనుషులు ఉంటారు. వారు గంటకో రకంగా ఉంటారు. వారిలో వికారంగా ఉన్న మనస్సు నిర్వికారంగా అవ్వాలంటే రామనామం చెయ్యమని చెపుతారు. రామనామం సర్వరోగనివారిణి. పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు మన మనస్సును సరిగా ఉండనివ్వవు. రామనామం మనలను నిర్వికార స్థితికి తీసుకొనిపోతుంది. తులసీదాస్ గారికి భార్యే గురువు. తులసీదాస్‌గారి భార్య ఏమంది అంటే నీకు నా మీద ఉన్న ప్రేమ, నామీద ఉన్న మోహం నీకు రాముడి మీద ఉంటే ఈపాటికి నీకు మోక్షం వచ్చేసును అంటుంది.

ఆ మాట ఆయనలో ఎంతో మార్పు తీసుకువచ్చింది. ఆవిడ ఎవరు అనటానికి ఆ రాముడే అనిపించాడు. ఆయన తులసీ రామాయణం వ్రాసాడు. శివరాత్రి రోజున ముఖ్యం ఏమిటి అంటే శివుడికి అభిషేకం చెయ్యటం, పగలు ఉపవాసం, రాత్రి జాగరణ అంటే రాత్రి అంతా శివస్మరణతో గడపాలి. ఆచార్యుడు అంటే మీకు స్కూలులో పాఠాలు చెప్పే టీచరు వంటివాడు కాదు. ఆచార్యుడు ఏమి చేస్తాడు అంటే ఆయన బోధిస్తాడు, అది మీ మనస్సుకు పడుతోందో లేదో చూసుకొంటాడు, అది మీకు అనుభవంలోనికి వచ్చేవరకు, ఆత్మసుఖం మీకు అందే వరకూ ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు, ఆయన అనుగ్రహస్వరూపుడు, ఆయనే ఆచార్యుడు. పూర్వం ఇలా మీటింగులు లేవు. ఏదో కొద్దిమందిని దగ్గర కూర్చోబెట్టుకొని చెప్పేవారు. ఇలా సమూహం కింద చెప్పరు. అవి ప్రసంగాలు కాదు, అవి అనుగ్రహభాషణములు. బుద్ధుడు వంటి మహాత్ములు చెప్పేటప్పుడే జ్ఞానోదయం అయిపోయేది. వారు చెప్పింది మాట కాదు, అది అనుగ్రహం.

యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుకు ఆత్మవిద్య గురించి బోధిస్తాడు. యాజ్ఞవల్క్యుడు బ్రహ్మఋషి. ఆయనకు సబ్జక్టు చేతిలో ఉంది, అది ఎలా చెప్పాలో తెలుసు. సబ్జక్టు వినేటప్పుడు జనకమహారాజు సంతోషంతో ఊగిపోతూ ఉండేవాడు. ఆయన సంతోషం పట్టలేక గురువుగారు మీకు వంద ఆవులు ఇచ్చానండి అనేవాడు. ఒకరోజు ఆయన ఉపదేశానికి ఉబ్బిపోయి బంగారు కాసులు ఇచ్చాను అనేవాడు. గురువుగారి ముఖంలో సంతోషం కనబడేది కాదు. ఆయన సబ్జక్టులో లీనమైపోయి ఉండేవాడు. ఇక్కడ జనకమహారాజుకు ఫౌండేషన్ ఉంది. అందువలన గురువు చెప్పేటప్పుడు ఆ సబ్జక్టు యొక్క అందాన్ని గ్రహించేవాడు. టీచింగ్ చేసేవాడు ఎంత గొప్పవాడైనా ఇక్కడ వినేవాడిలో ఫౌండేషన్ లేనప్పుడు, అర్హత లేనప్పుడు సబ్జక్టు విలువను గ్రహించలేడు. పదిరోజులలో జనకమహారాజుకు సబ్జక్టు చెప్పి చివరలో ఒకమాట చెపుతాడు. ముందు నేను చెప్పిన సబ్జక్టును మీరు అర్థంచేసుకోండి, దాని తాలుక సుఖం మీకు తెలియాలి. అప్పుడు మీరు ఏదైనా ఇస్తే పుచ్చుకొంటాను కాని కండిషన్ ఏమిటి అంటే నేను గురువుగారికి ఆవులు ఇచ్చాను, డబ్బులు ఇచ్చాను అని మీకు జ్ఞాపకం రాకూడదు, అలా మీరు మనస్సులో అనుకొన్నా నేను పుచ్చుకోను. మీరు డబ్బులు ఇవ్వకపోయినా ఫరవాలేదు, నాపట్ల కృతజ్ఞత ఉంటేచాలు. అక్కడ మీరు ఇచ్చే ఆవులు ముఖ్యం కాదు. ఆవులు ఇచ్చేటప్పుడు ఏ దృక్పథంతో ఇస్తున్నారో అది ముఖ్యం. ఆ దృక్పథం సరిగా లేకపోతే మీరు ఇచ్చే ఆవులు మమ్మల్ని సుఖపెట్టవు సరికదా అనారోగ్యాన్ని తీసుకొనివస్తాయి. మీకు ఇలా ఉండాలి అని చెపుతున్నాను మరి నేను ఎలా ఉండాలి ఉంటే నేను కష్టపడి చదువు చెప్పాను అనే విషయం నేను మరిచిపోవాలి. మీరు ఇచ్చిన డబ్బు జ్ఞాపకం ఉండకూడదు కాని మీరు ఇచ్చిన దానికి కృతజ్ఞత కలిగిఉండాలి.

ఒకరిపట్ల ఒకరు కృతజ్ఞత కలిగిఉండాలి, పరస్పరం ప్రేమలు ఉండాలి, మిగిలిన విషయాలు జ్ఞాపకం ఉండకూడదు. అది గురుశిష్యుల సంబంధం.

నువ్వు మూగవాడిగా ఉండకు, చెవిటివాడిగా ఉండకు అని శాస్త్రంలో చెప్పాడు. ఎవరైనా పెద్దలు మంచిమాటలు చెపుతూ ఉంటే చెవిటివాడిగా ఉండకండి. ఆ మాటలను శ్రవణం చెయ్యండి. వినటం వలన నష్టంలేదు. మంచిమాటలను శ్రవణం చేయటం వలన ఎప్పుడైనా మనకు అవసరమైనప్పుడు సడన్‌గా జ్ఞాపకం వస్తాయి. అంటే చెవుల ద్వారా వినటం కాదు, చెవులద్వారా ఎవడు వింటున్నాడో ఆ మనస్సును శరీరంతోపాటు అక్కడే ఉంచి అంటే మనస్సును అక్కడ పెట్టి వినాలి. మూగవాడిగా ఉండకు అంటే నీకు తెలిసిన విద్యను, నువ్వు విన్న మంచిమాటలను అవసరమైతే ఇతరులకు చెప్పాలి. వారు విన్నా వినకపోయినా నీకు మంచి అని తోస్తే అది ఇతరులకు చెప్ప. మీరు అందరూ మోక్షం అంటే సరదా పడుతున్నారు. మాకు మోక్షం కావాలి అంటున్నారు. అక్కడ శరీరం ఉండదు ముందు ఆలోచించుకోండి. మీకు శరీరాలు అంటే ఇష్టం కదా మరి మోక్షం వస్తే ఇంక ఈ శరీరం గొడవ ఉండదు. మోక్షం అంటే అక్కడ మనం ఉన్నామన్న సంగతి మనకు తెలుస్తూ ఉంటుంది. అక్కడ దేహం గొడవ, మనస్సు గొడవ ఉండదు. అక్కడ జ్ఞానంగా ఉంటాము, శాంతిగా ఉంటాము, సుఖంగా ఉంటాము. రామకృష్ణ పరమహంసగారి దేహము, మనస్సు పరిశుద్ధముగా ఉండేది. మన మనస్సు, దేహము అంత పరిశుద్ధమైతే గాని మనకు ఆత్మజ్ఞానం రాదు. అందరిహృదయాలలో నేను ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు కదా అది గుర్తించే అర్హత లేక ఎక్కడో బయట తిరుగుతున్నాము. అర్హత లేనివారికి, యోగ్యత లేనివారికి విద్య చెప్పినా అది రాణించదు. పూర్వపు రోజులలో ఆచార్యులు ఏమి చేసేవారు అంటే అర్హత ఉన్న శిష్యులను చేరదీసి వారికి తినటానికి తిండి లేకపోయినా వారే దగ్గర ఉంచుకొని అన్నం పెట్టి విద్య చెప్పేవారు. మన దేహము, మనస్సు పరిశుద్ధమవ్వాలి. అప్పడే లోపలఉన్న సత్యాన్ని తెలుసుకొనే అర్హత కలుగుతుంది.

భగవాన్ దగ్గరకు వెళ్ళి అక్కడకు వెళ్ళాము, ఇక్కడకు వెళ్ళాము, వారు అలా మాట్లాడారు, వీరు ఇలా మాట్లాడారు అంటే భగవాన్ ఏమన్నారు అంటే అది వారి తప్పకాదు, నీదే తప్ప అనేవారు. ఎక్కడకు వెళ్ళాలి, ఎక్కడకు వెళ్ళకూడదు అని ముందు మీకు ఆలోచన ఉండాలి, వివేకం ఉండాలి. అందుచేత మీకు వివేకం తక్కువ ఉన్నా గురువు చెప్పిన మాట మీద విశ్వాసం ఉంటే తెలివైన వారికంటే మీరు ఎక్కువ లాభం పొందుతారు. మీరు ఆలోచించి ఆలోచించి కొంతదూరమే వెళ్ళగలరు. మీకు ఆచార్యుడిపట్ల విశ్వాసం ఉంటే అదే మిమ్మల్ని గమ్యానికి చేరుస్తుంది. మీ గురించి మీరు ఎక్కడా గొప్పలు చెప్పకోవద్దు. కొంతమందికి ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకు ఎవరో ఇతరులను నిందించటం, వారిని

వారు పొగుడుకోవటం తప్పించి ఇంకో పని ఉండదు. నేను అది సాధించాను, ఇది సాధించాను అని చెప్పకోవటం వలన దేహాభిమానం పెరిగిపోతుంది, అజ్ఞానం పెరిగిపోతుంది, స్వరూపానికి దూరమైపోతాము. ఇతరులు మిమ్మల్ని గౌరవిస్తే అదివేరు, ఇతరులు అందరూ మిమ్మల్ని గౌరవించాలి అనుకోకూడదు. మేము బాగా చదువుకొన్నాము అనే గర్వం, మేము ధనవంతులం అనే గర్వం, ఈ సమాజంలో మాకు చాలా గౌరవం ఉంది అనే గర్వం ఇవన్నీ చాలా ప్రమాదం. మీరు సాధన చేసినా అవి అంత తొందరగా పోతాయి అని చెప్పలేము. వాటిని తొలగించుకోవటం చాలా కష్టం. మీకు బంగారం ఉంటే దాచుకోండి. ఎక్కువగా మెడలో వేసుకొని తిరగవద్దు. మీకు డబ్బు ఉందని ఖరీదైన బట్టలు వేసుకొని తిరగవద్దు. దానివలన అహంకారం పెరుగుతుంది. మీకు ఏదైనా ఉన్నా పైకి ప్రదర్శించకండి. కొంతమంది పైకి మర్యాదగా మాట్లాడతారు లోపల గర్వం పెంచుకొంటారు. అది మరీ ప్రమాదం. కొంతమందికి అప్పలు ఉంటాయి. అప్పలు ఎవరికీ తెలియనివ్వకపోయినా వడ్డీ పెరిగిపోతూ ఉంటుంది కదా. అలాగే మనకు గర్వం ఉన్నట్లు ఎవరికీ తెలియకుండా ప్రవర్తించినా లోపల కుళ్ళిపోతూ ఉంటాము. ఇవన్నీ జాగ్రత్తగా పరిశీలించుకోండి.

మీరు వాక్కుద్వారాగాని, చేతద్వారాగాని ఎవరినీ హింస పెట్టకూడదు. మీరు చెప్పే మాట సౌమ్యంగా ఉండాలి. చెప్పేది సాత్వికంగా ఉండాలి. సత్వగుణంలో ఉండి చెపితే ఆ మాట చాలా మధురంగా ఉంటుంది. సాత్వికంగా మాట్లాడితే వారినోట్లో లడ్డూ పెట్టినట్లు ఉంటుంది. రజోగుణంలో చెపితే వారి నోట్లో కారం పోసినట్లుగా ఉంటుంది. స్వధర్మం, పరధర్మం గురించి ఐన్‌స్టీన్ ఏమి చెప్పాడు అంటే ప్రతీ మనిషికి ఒక స్వభావం ఉంటుంది. ఆ స్వభావానికి అనుగుణమైన పనే చేసుకో. ఎవరో చేస్తున్నారని నువ్వు చెయ్యవద్దు, వారిని అనుకరించవద్దు. నీ స్వభావానికి అనుగుణమైన పనిచేస్తే ఆ పని నిన్ను సుఖపెడుతుంది, నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, ఆ పని నీకు జ్ఞానాన్ని పట్టి ఇస్తుంది. పనిచేస్తూ పనిని దాటివెళ్ళిపో అంతేగాని సోమరితనంగా కూర్చొంటే పనిని దాటలేవు. ఇది మీ జీవితం పొడవునా జ్ఞాపకం పెట్టుకోండి. మనం మంచివారము అని ఇతరులు చెప్పకొంటే మనం మంచివారము కాదు. మన బుద్ధికి మనం ఋజువుగా ఉండాలి. మనం చేసిన పనులకు ఏదోరోజున భగవంతుడి ముందు నిలబడి సమాధానం చెప్పాలి, అది గుర్తు పెట్టుకోండి. నువ్వు ఇతరులను బాధపెట్టవద్దు. ఇతరులు నిన్ను హింసించినా నువ్వు హింసకు గురికావద్దు. ఇతరులు నిన్ను బాధ పెట్టినప్పడు నువ్వు సహనంగా ఉండటం, వారి వలలో పడకుండా ఉండటం కూడా ఒక సాధన. ఋజుత్వం అనేది, సరళత్వం అనేది నువ్వు తెచ్చిపెట్టుకొన్నట్లు ఉండకూడదు, అవి సహజంగానే ఉండాలి. నీ శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొంటూ ఉంటే నీ శరీరం, మనస్సు

హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి నీకు సహకరిస్తాయి. నీ ఆరోగ్యం సరిగా లేనప్పుడు నువ్వు సత్యాన్వేషణ చెయ్యలేవు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గోచరం చేసుకోకుండా ఏది సాధించినా అది అంతా స్వప్నమే. మీకు జ్ఞానోదయం అయ్యాక ఇది అంతా అబద్దం అని మీకే తెలుస్తుంది. ఆత్మవిద్య సంపాదించటానికి నిరంతరం కృషిచెయ్యి. అన్ని విషయాలకంటే మనోనిగ్రహం గొప్పది. మనోనిగ్రహం కోసం ప్రయత్నం చెయ్యి. నీకు ఏకాంతవాసం కొంత అవసరం. ఎప్పుడూ జనాలతో కలిసిపోయి బజారులో పడిపోకండి. ఇంటి దగ్గర కొంతటైము ప్రశాంతంగా ఒంటరిగా కూర్చోండి. ఏకాంతంగా ఉన్నప్పుడు మనలో ఉన్న మంచి చెడ్డలు మనకు తెలుస్తాయి, మీరు పోగొట్టుకోవలసింది ఏమిటో మీకు తెలుస్తుంది. అది పోగొట్టుకోవటానికి నిరంతరం కృషిచెయ్యండి, ఆ ప్రయత్నంలో విసుగుదల పనికిరాదు.

భగవద్గీతలోని శ్లోకాలను, పెద్దలు చెప్పిన మాటలను అప్పుడప్పుడూ తలపెట్టుకోండి. వాటిని తలపెట్టుకోవటం వలన మీ బుద్ధికి బలం పెరుగుతుంది, జ్ఞాపకశక్తి పెరుగుతుంది, సత్యాన్ని తెలుసుకొనే యోగ్యత కలుగుతుంది. బంగారాన్ని శుద్ధి చేయటానికి నిప్పులో పడేస్తారు, అప్పుడు బంగారంలో ఉన్న మాలిన్యం అంతా పోయి బంగారం శుద్ధి అవుతుంది. అలాగే మీ మనస్సులో ఉన్న దుర్గుణాలు, దోషాలు పోవటానికి మనస్సును తీసుకొనివెళ్ళి భక్తి అనే నిప్పులో పడేయండి. భక్తి నీ మనస్సులో ఉన్న దోషాలను తొలగిస్తుంది, అప్పుడు మనస్సు శుచి అవుతుంది. విషయసుఖాలపట్ల వైరాగ్యం కలిగి ఉండండి. విషయసుఖాలు మొదట తియ్యగా ఉంటాయి కాని పరిణామంలో అవి చేదుగా మారిపోతాయి, దుఃఖాన్ని తీసుకుని వస్తాయి. జాయ్ వేరు, ఎంజాయ్ వేరు. వివేకం వలన, విచారణ వలన, ఆత్మచింతన వలన మీ హృదయంలో నుండి వచ్చే సంతోషాన్ని జాయ్ అంటారు. దానికి ముగింపు లేదు, అది ఆరోజుకారోజు పెరిగిపోతూ ఉంటుంది, అది స్వతంత్రమైనది. ఇక బాహ్య వ్యక్తులమీద, వస్తువులమీద, సంపదల మీద ఆధారపడి వచ్చే సంతోషం ఎంజాయ్‌మెంట్. ఇది మొదట బాగానే ఉంటుంది. తరువాత విసుగు వచ్చేస్తుంది. ఈ సంతోషం పరిణామంలో దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. ఒక దెయ్యం ఋషికి కనబడింది. నువ్వు ఏపని చెపితే ఆ పని చేస్తాను కాని పని చెప్పకపోతే నిన్ను తినేస్తాను అంది. వీడు ఏపని చెపితే ఆ పని చెసేస్తోంది. ఎన్ని పనులు చెపుతాడు. ఆయన ఋషికదా వివేకం ఉపయోగించి ఒక కర్ర పాతేసి దీనిపైకి కిందకు తిరుగుతూ ఉండు అన్నాడు. ఆ తిరగటానికి ముగింపు లేదు కదా. మన మనస్సు కూడా దెయ్యం లాంటిది. దానికి పని చెప్పకపోతే అది మనలను తినేస్తుంది. రోజూ కల్పించుకొని పనులు ఎక్కడ చెప్పగలము. అందుకే ప్రాణాయామం చెప్పారు. మీరు మర్చిపోయినా ముక్కులోగాలి అలా తిరుగుతూ

ఉంటుంది కదా. మీ మనస్సును తీసుకొని వెళ్ళి ముక్కులో గాలి దగ్గర పాడేయమన్నారు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీ మనస్సును డైరెక్టుగా ఫేస్ చెయ్యలేక, దానిని పరిష్కరించు కోలేక ఇలాగ డొంకతిరుగుడు పద్ధతులలోనికి వెళ్ళావా అంటున్నారు. విషయసుఖాలను జాగ్రత్తగా తగ్గించుకొంటూ రావాలి. ఒకేసారి తగ్గిస్తే అవి ఎదురుతిరుగుతాయి. సడన్ బ్రేక్ వేస్తే ఉన్నది చెడిపోతుంది. నెమ్మదిగా అర్ధమయ్యేలాగ చెప్పి, విషయస్మరణ వలన పరిణామంలో ఎంత అశాంతి వస్తుందో మనస్సుకు బోధించి మన మనస్సును మనమే ఉద్ధరించుకోవాలి. మనం రోజుకోసారి చనిపోతూ ఉంటాము అంటే మనం రోజూ నిద్రపోతాం కదా. నిద్రపోయిన వాడు చనిపోయిన వాడితో సమానం. అసలు చావు వేరుపాటుగా వస్తుంది, అది మహా చావు, అప్పుడు పెర్మనెంట్‌గా ఈ శరీరాన్ని విడిచిపెట్టస్తాము, ఈ లోపు రోజూ నిద్రలోనికి వెళ్ళేటప్పడు ట్రైల్ వేసుకోమంటున్నాడు ఆచార్యులవారు. రోజూ నిద్రపోయే ముందు భగవంతుడి రూపాన్ని ధ్యానించుకో, ఆయన నామాన్ని స్మరించుకో, ఆ ధ్యాసలో మీకు నిద్ర రావాలి. అలా ప్రయత్నం చేస్తూ ఉంటే మహాచావు వచ్చినప్పడు కూడా ఆ ధ్యాసలో ప్రిఫర్ అవుతాము దానికోసం ఇక్కడ ముందు రెడీ అవ్వాలి. భోజనం చెసేటప్పడు మొదటి ముద్ద పెట్టుకొనేటప్పడు గోవింద గోవింద అనుకొంటారు. కాని నాకు గోవింద శబ్దం రావటంలేదు. కాటన్ కాటన్ అనుకొంటాను ఎందుచేతనంటే మన జిల్లాలకు అన్నం పెట్టినవాడు కాటన్. కాటన్ దొర ఇక్కడ పడిన కష్టాలు, ఆయన పడ్డ తిట్లు అన్నీ నాకు తెలుసు. ఇన్ని తిట్లుతిని, ఏమీ సంపాదించుకోకుండానే వట్టి చేతులతో ఇంగ్లాండ్ వెళ్ళిపోయాడు. ఆయన కాటన్ దొర.

మీ దుఃఖానికి కారణం బయటలేదు. నీలోపలే ఉంది, కర్తృత్వరూపంలో ఉంది. కర్తృత్వం ఉన్నంతసేపు వాడు ఎంతటివాడైనా దుఃఖం ఆగదు, పునర్జన్మలు ఆగవు. కర్తృత్వం లేనివాడికి దుఃఖం లేదు. మనం అస్తమాను నేను, నేను అంటాము. సర్వసాధారణంగా మనం మాట్లాడేటప్పడు ముందు నేను వచ్చేస్తుంది. ఆ నేనును తగ్గించుకోవాలి, ఆ నేనును ప్రక్కన పెట్టి మాట్లాడితే ఆ మాట సౌమ్యంగా ఉంటుంది, అది ఎదుటివారి గుండెకు పడుతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితములు అని భగవాన్ చెప్పారు. దీనిని సరిగా అర్థం చేసుకోలేక చాలామంది పెద్దవారు దీనిని ఆక్షేపిస్తున్నారు. అసలు ఈయన భక్తుడా, నాస్తికుడా అంటున్నారు. దేవుడు కూడా మనోకల్పితం అంటే దాని గురించి కొంతమంది భక్తులకు కోపాలు వస్తున్నాయి. నీకు నిద్రలో దేహంగొడవ, మనస్సు గొడవ, లోకం గొడవ, దేవుడు గొడవ ఉందా? ఏ గొడవ లేదు. మనకు ఎంత డబ్బు ఉన్నా, చదువు ఉన్నా కామన్‌సెన్స్ లేనివారు రాణించలేరు. నీకు దేవుడి గొడవ ఎప్పడు వస్తోంది మెలకువ వచ్చాక వస్తోంది. నిద్రలో దేవుడి గొడవలేదు. మెలకువ రాగానే మనస్సు వస్తోంది. మనస్సుతో పాటు లోకం

గొడవ, దేవుడి గొడవ, పుణ్యపాపాలు, జన్మల గొడవ అన్నీ వస్తున్నాయి. గాఢనిద్రలో మనస్సు అణిగిపోయినప్పుడు అన్నీ అణిగిపోతున్నాయి. మెలకువ రాగానే మనస్సు వచ్చాక ఈ గొడవలు అన్నీ వస్తున్నాయి. మనస్సు వచ్చాక ఏ గొడవలు అయితే వస్తున్నాయో, మనస్సు ఎంత నిజమో ఆ గొడవలు కూడా అంతే నిజం. అంటే నీ మనస్సు ఎంత నిజమో దేవుడు కూడా అంతే నిజం. నీకు పూర్వపుణ్యం లేకపోతే అసలు అద్వైతవాసన కూడా రాదు. మనస్సు వచ్చినప్పుడు ఏవైతే వస్తున్నాయో అవి అన్నీ మనోకల్పితములే. శరీరం వచ్చింది అంటే మరణం వస్తుంది, రోగం వస్తుంది, ముసలితనం వస్తుంది. ఏదోరోజున చనిపోతాము. ఈలోపుగా దేహప్రారబ్ధాన్ని బట్టి ఏదో ఒకటి వస్తూ ఉంటాయి. ఇప్పుడు మీకు కష్టాలు లేవు అనుకోవద్దు ఏదో టైములో రావచ్చు.

దేవుడియందు ప్రేమకలిగి ఉండటమే భక్తి. వ్యభిచారభక్తి పనికిరాదు. వ్యభిచారభక్తి అంటే భక్తి స్థిరంగా ఉండదు, శాశ్వతంగా ఉండదు, ఎంతోకొంత భక్తి ఉంటుంది కాని శ్రద్ధ ఉండదు. నీకు ఉండవలసింది వ్యభిచారభక్తి కాదు, అవ్యభిచారభక్తి ఉండాలి. అంటే చపలత్వం ఉండకూడదు, విశ్వాసం స్థిరంగా ఉండాలి. మీరు నిద్రపోయేముందు మిమ్మల్ని ప్రేమించేవారిని, మీ క్షేమం కోరేవారిని స్మరించుకొని పడుకోండి. మీకు గాఢమైన నిద్ర వచ్చేస్తుంది. మిమ్మల్ని చూసి అసూయపడేవారిని, మిమ్మల్ని ద్వేషించేవారిని దృష్టిలో పెట్టుకోవద్దు. అరవిందఘోష్‌గారిని ఉరితీద్దాము అనుకొన్నారు. చిత్తరంజన్‌దాస్ బెంగాల్ కోర్టులో 16 రోజులు వాదించారు. మీరు ఆయన శరీరాన్ని ఉరితీయవచ్చు. ఆయన శరీరం పంచభూతాల్లో కలిసిపోతుంది. కాని ఆయన మానవజాతిని ఎంత గాఢంగా ప్రేమించాడో అది ప్రపంచం మరిచిపోదు. మనిషిని ఉరితీయగలరు కాని ఆయనకు మానవజాతిమీద, భగవంతుడిమీద ఉన్న ప్రేమను ఎక్కడ ఉరితీయగలరు అన్నాడు. భాగవతంలో ఒక మహాభక్తుడు ఏమన్నాడు అంటే ఓ నారాయణా! నాకు మోక్షం ఇవ్వకు, నాకు జన్మలు రాకుండా చేయమని నేను కోరుకోను. నువ్వు అందరి హృదయాలలో ఉంటున్నావుకదా అలాగే నన్ను కూడా అందరి హృదయాలలో ఉండేలాగ చెయ్యి. కాని నువ్వు చేసేపని నేను చెయ్యను. నువ్వు అందరి హృదయాలలో ఉండి వారి ప్రారబ్ధాన్ని బట్టి ఆ జీవులను నడిపిస్తున్నావు, వారు చేసిన కర్మలకు ఫలితాన్ని ఇస్తున్నావు. నేను అందరి హృదయాలలో ఉండి ఏమి చేస్తాను అంటే ప్రతీ జీవుడికి ఎంతోకొంత దుఃఖం ఉంటుంది కదా. ఆ దుఃఖం వారికి రాకుండా ఆ దుఃఖాన్ని నేను భరించే శక్తిని నాకు ఇయ్యి. వారి పుణ్యం నాకు వద్దు, వారి శాంతిని వారికే ఇచ్చెయ్యి. ఎవరికైతే దుఃఖం వచ్చిందో ఆ దుఃఖంవారు పడకూడదు, ఆ దుఃఖం నేను అనుభవిస్తాను అన్నాడు. నేను భాగవతంలో ఇది చదివేవరకూ అంత గొప్ప భక్తులు ఉంటారని నేను ఊహించలేదు. అటువంటి ఉత్తమోత్తములు ఉంటారని మనం ఊహించలేము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 7 | జిన్నూరు, శ్రీరమణ క్షేత్రం |
| మార్చి | 31 | జిన్నూరు, శ్రీరమణ క్షేత్రం |
| ఏప్రియల్ | 21 | అమలాపురం, క్షత్రియ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**చించినాడ ప్రెసిడెంటుగారిచేత నిర్మింపబడిన**

**అతిథి భవనము ప్రారంభోత్సవములో**

**సద్గురు శ్రీ నాన్నగారు,**

**పాలకొల్లు శాసన సభ్యురాలు శ్రీమతి బంగారు ఉషారాణిగారు**

# బాధను పోగొట్టటానికే బోధ

అవిద్య అనే స్వప్నములో మనం ఉన్నంతకాలం కన్నీటికి, చిరునవ్వుకూ మధ్య మనం జీవించక తప్పదు, అంతవరకూ మనం సత్యాన్ని తెలుసుకోలేము. అక్కడ నిరంతరం బాధ కాపురముంటుంది. దీని పరిష్కారాన్ని శంకరులు సత్‌సంఘంవల్ల నిస్సంగత్వం, దానివల్ల నిర్మోహత్వం, దానివల్ల నిశ్చలత్వం వస్తుంది. నిశ్చలత్వమే జీవన్ముక్తి అన్నారు. "నీచ గుణములెల్ల నిర్మూలమైపోవు సుజన గోష్టివల్ల" అన్నది సత్యం. భయం సాంప్రదాయం యొక్క బరువు. మన జీవితంలో ఏదైనా అపహాస్యమైన విషయం జరిగితే ఒంటరిపాటుతో కుమిలిపోకూడదు. అవి అన్ని స్వప్నాలే, బోధ యొక్క ప్రయోజనం అదే. ప్రేమకు మూల శత్రువు అహంకారం. రాగము, ఆశక్తి, మోహము, ఈర్ష్య, క్రోధము దాని సంతానం. అహంకారం పరివారం చాలా పెద్దది. ఆ శత్రువులను శ్రవణ మహిమ వల్ల జయించటం వల్ల వాటిపై విరక్తి ఉత్పన్నమై, విషయాశక్తి వగైరాలు తెగిపోతాయి. చిత్తశుద్ధి కలుగుతుంది. సత్యం నేనే అనే బుద్ధి ధృడమౌతుంది. అభిమానం, మమత్వం తొలగిపోతాయి. సందేహాలు, శంకలు ఎగిరిపోతాయి. నేను అనే భావం తొలగిపోతుంది. సద్గురువు ప్రవచనం అత్యంత శ్రద్ధగా వినాలి. ఆ మాటలు హృదయం నుంచి వస్తాయి కాబట్టి మన హృదయాన్ని తాకుతాయి. అప్పుడు మన అజ్ఞానం అంతరిస్తుంది. శ్రీనాన్నగారు "అంతా ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతోంది అని బోధపడితే ఈ గంతు ఇక్కడ ఇలా వేద్దాము, ఆ గంతు అక్కడ అలా వేద్దాము అనే ఆలోచన రాదు. దానికి బోధ కావాలి. ఏదైనా వింటేకదా విషయం తెలిసి ఆచరిస్తారు" అన్నారు. రూపం యొక్క అనిత్యత్వాన్ని దాని పరిణామ స్వభావము తెలుసుకొన్నవాడు బెంగలుపోతాయి సుఖి అవుతాడు - వివేకం, సద్‌బుద్ధి శ్రవణం వల్లనే సాధ్యం కాబట్టి దానికి సమానమైనది మరియొకటి లేదు. దురాత్ముడు పుణ్యాత్ముడు అవుతాడు. సత్యానుభవానికి మనం వెయ్యినొక్క అవరోధాలు సృష్టించుకొంటున్నాము. దానిలో భయం ఒకటి అది మనలను స్వంతం చేసుకొంటుంది. మనం మనలోనే ముడుచుకొనిపోతాము. ఊరకఉంటే ఉన్నది ఉన్నట్లు వ్యక్తమవుతుంది. విషయాలను తేలికగా తీసుకోవాలి లోపల నిండుగా మెలుకువగా జీవించాలి. అందానికి స్పందించటం అసహ్యానికి చీదరించుకోవటం వల్ల ఘర్షణ కలుగుతుంది. ఎప్పడూ స్వచ్ఛంగా ఉండాలి. పరిస్థితులకు బానిస కాకుండా జాగరూకతతో ఉండాలి. ఇది గురుబోధ యొక్క వైభవం వల్లనే సాధ్యమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**